తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## టమోటా పంటను ధ్వంసం చేసిన ఏనుగులు



సదుం, జూన్ 6 ప్రభాతవార్త
మండల పరిధిలో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా బుధవారం రాత్రి చెరకు వారిపల్లె పంచాయతీ పోతుంవారిపల్లె వద్ద ఏనుగులు సంచరించాయి. గ్రామానికి సరిహద్దులో వేసిన టమోట పంటను తొక్కుకుంటూ తినుకుంటూ వెళ్లాయి. వి.ప్రకాష్ అనే రైతుకు చెందిన ఎకరాకు పైగా టమోటా పంటను తొక్కి తిరుగాడి కాయలు తిన్నాయి. వర్షాలు కురుస్తుండటంతో ఏనుగుల సంచారం వల్ల పొలాల్లో బురదలో ఏనుగులకు సంబంధించి పెద్ద పెద్ద అడుగులు పడటంతో అవినడిచిన చోట పంట దెబ్బ తింటోంది. టమోటా పంటలో నాటిన కర్రలు సైతం విరిగి పోతునా న్నయి. ప్రస్తుతం బాక్సు టమోటా ధర రూ.700లు పలుకుతోంది. ఈపరిస్థితులలో ఏనుగుల దాడి వల్ల టమోటా రైతులు దెబ్బతింటున్నారు.

## తిరుమల జోరువర్షం



తిరుమల, జూన్ 6 ప్రభాతవార్తప్రతినిధి:
నైరుతిరుతుపవనాలు రాకతో గురువారం మధ్యాహ్నం తిరుమల, తిరుపతిలో జోరువర్షం కురిసింది. గత రెండురోజులుగా అడపాదడపా వర్షం కురుస్తోంది. గురువారం ఉదయం నుండి వాతావరణంలో మార్పుతో చల్లటిగాలులు వీచాయి. మధ్యాహ్నం జోరువాన కురవడంతో వాతావరణంలో మార్పు వచ్చి చలిగాలులు వీస్తున్నాయి.

# రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా విధులు

### టిడిపి ఎంపీలతో పార్టీ అధినేత నారా చంద్రబాబు



టిడిపి ఎంపీలతో సమావేశమైన జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు

చిత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త:
రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వంతో నిధులు మంజూరు చేయించేలా కృషి చేయాలని తెలుగుదేశం ఎంపీలకు జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు. విజయవాడ ఉండవల్లిలోని జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నివాసంలో గురువారం తెలుగుదేశం పార్టీ ఎంపీలతో చంద్రబాబునాయుడు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎంపీగా ఎన్నికైన దగ్గుమళ్ళ ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వం తమ పార్టీ మద్దతుతో ఏర్పాటు కానుండటంతో రాష్ట్రానికి వీలైన మేరకు నిధులు మంజూరు చేసేలా ఎంపీలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. కేంద్రంలో ఏర్పాటు కానున్న ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ సైతం భాగస్వామ్యం కానుండటంతో రాష్ట్రానికి ఎన్ని మంత్రి పదవులు కావాలో పక్కాగా ఆలోచించాలన్నారు.

# పలకరించిన నైరుతి

### ఉరుములు, మెరుపులతో వర్షం - పులకించిన ప్రజలు




శ్రీకాళహస్తి, జూన్ 6 ప్రభాతవార్త
మూడు నెలలుగా భానుని ప్రతాపంతో తల్లడిల్లిన ప్రజలు, రైతులు బుధ, గురువారం కురిసిన ఉరుములు, మెరుపుల వానతో ఉపశమనం పొందారు. నైరుతి పవనాలు తిరుపతి జిల్లాను గురువారం రాత్రి తాకాయి. దాంతో పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీకాళహస్తిలలో వర్షం కురిసింది. దాంతో ప్రజలు, రైతులు పులకించిపోయారు. గురువారం ఉదయం నుంచి భానుడు తమ వేడి ప్రతాపాన్ని చూపాడు. ఎండలు, సెగలతో తల్లడిల్లారు. రెండు నెలలుగా వేసవి ఎండలు దడపుట్టించాయి. గత నెల 20వ తేది నుంచి నైరుతి రుతుపవనాలు వచ్చేస్తున్నాయని ప్రకటనలు వెలువడటంతో ప్రజలు ఎప్పుడెప్పుడా? అని ఎదురు చూసారు.

**తిరుపతి జిల్లాలో వర్షాలతో ఆనందం:**
గతంలో తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాగా ఉండటంతో సగం జిల్లాలో నైరుతి రుతుపవనాలతో వర్షాలు కురుస్తాయి. తూర్పు నియోజకవర్గాలైన శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు నియోజకవర్గాల్లో ఈశాన్య రుతుపవనాల తో వర్షాలు కురుస్తాయి. అయితే ప్రస్తుతం జిల్లా విభజించబడింది. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలు వచ్చాయి. తిరుపతిలో మాత్రం నైరుతి రుతుపవనాలతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో ఈశాన్య రుతుపవనాలతో వర్షాలు కురుస్తాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి తిరుపతి శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో సమృద్ధిగా వర్షం కురిసింది. అయితే ఎండ వేడిమితో తల్లడిల్లుతున్న పట్టణ ప్రజలకు ఉపశమనం కల్గింది. గత కొన్ని నెలలుగా గ్రామాల్లోని రైతులు సక్రమంగా విద్యుత్ సరఫరా కాకుండా ఇఎల్ఆర్ సాకుతో ఇచ్చే ఏడు గంటలు కూడా సక్రమంగా ఇవ్వలేని దుస్థితి చోటు చేసుకుంది. దాంతో పంట పొలాలకు నీరుసరఫరా ప్రశ్నార్థంగా మారింది. ఈ దశలో ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో రైతుల్లో ఆనందోత్సాహాలు చోటు చేసుకున్నాయి. కరెంటు ఉన్నా లేకున్నా పది రోజుల పాటు ఇటు వరి, అటు వేరుశెనగ పంటలకు నీటి ఇబ్బంది తొలగిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ వర్షంతో భూగర్భ జల మట్ట పెరదగని వివరిస్తున్నారు. ఎండ వేడిమితో సెగలు కక్కుతున్న నేల తల్లి చల్లబడింది.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో కనబడని దళారులు: తట్టలకు వసూళ్ళకు స్వస్తి

### సంస్కరణలకు శ్రీకారం

శ్రీకాళహస్తి, జూన్ 6 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. గురువారం ఆలయంలో ఎక్కడా దళారుల సంచారం కనబడలేదు. అధికారులు వారించారా? లేక వారికి వారే నిలిచిపోయారా? అనేది చర్చనీయాంశంగామారింది. ఇక గురువారం రాహుకేతుదోష నివారణ పూజలు, పరివార దేవతల ఆలయాల వద్ద తట్టలతో దర్శనమిచ్చే అర్చకులు కనబడలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో హఠాత్తుగా మార్పుకు కారణమేమిటని భక్తులు చర్చించుకుంటున్నారు. బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో తెలుగుదేశం పార్టీ తరఫున గెలిచిన బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారులు సిబ్బందితో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ' ఆలయం నుంచి ఒక పైసా అవసరం లేదు. ఎవర్ని అయినా ఇబ్బంది పెడితే సహించను' అని హెచ్చరించటంతో అధికారులు, సిబ్బందిలో మార్పు వచ్చింది. దాంతో గురువారం ఆలయంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్న భక్తులు గతంలో ఇక్కడ వచ్చి పూజలు జరిపించుకున్న వారు 'ఏమీటీ? మార్పు' అంటూ చర్చించుకున్నారు. గతంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకునే భక్తులను ముక్కుపిండి పూజల పూర్తి అయిన వెంటనే దక్షిణ అంటూ రేట్లు ఖరారు చేసి వసూలు చేసుకునే వారు. ఈ సొమ్ములను సాయంత్రం జరిగిన పూజల టిక్కెట్లు మేరకు ఒక్కొక్క టిక్కెట్టుకు ఆలయంలో అధికారులు, సిబ్బందికి వాటాలు పంచే వారు. అలాగే ఆలయంలోని స్వామి అమ్మవార్ల గర్భగుడి వద్ద తట్టలలో వసూళ్ళకు సంబంధించి భారీ ఎత్తున వ్యాపారం జరిగేది. ఓ ప్రధానార్చకుడు అధికారులకు వాటాలు అందించుటకు డ్యూటీలను అమ్ముకున్నట్లు విమర్శలు వెలువెత్తాయి. ఇక ఆలయంలో దళారుల దందా విచ్చల విడిగా మారి ఆలయ పవిత్రతే ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ పరిస్థితిని బాగా అధ్యయనం చేసిన బొజ్జల సుధీర్‌రెడ్డి ఎంఎల్ఏగా గెలిచిన వెంటనే దృష్టి సారించారు. కట్టడి చేయటానికి ప్రయత్నించారు. గురువారం ఆలయం వద్ద వాతావరణమే ప్రత్యేకంగాకనబడింది. వచ్చిన భక్తులు సాదాసీదాగా దళారుల బాధ లేకుండా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూడాలి. ఇక్కడ వాటాలకు అలవాటు పడ్డ ప్రాణాలుఎలా స్పందిస్తాయో? వేచి చూడాలి.



డబ్బులు లేకుండా దీపంకే పరిమితమై ఆలయంలో తట్ట

# శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం..!

### సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసు డేగకన్ను
### అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై సమాచారం
### తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు



చంద్రగిరి, జూన్ 6 ప్రభాతవార్త:
శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ చంద్రగిరి (నియోజకవర్గం) మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు కొటాల, కూచివారిపల్లి, ఏ.రంగంపేట, శేషాపురం, కందులవారిపల్లి, చిన్న రామాపురం, భీమవరంలో గురువారం ఆయన విస్తృతంగా కలియదిరిగి పరిస్థితులను తెలుసుకున్నారు. ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్లను తనిఖీ చేసిన ఆయన అక్కడి సిబ్బందికి అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో రాజకీయ వైషమ్యాలతో ఎవరైనా ఘర్షలకు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉక్కుపాదంతో తొక్కిపడేస్తామని హెచ్చరించారు. అనంతరం సిఐ రామయ్య, ఎస్ఐ అనితలకు పలు సూచనలు చేశారు. బందోబస్తు కొరకు ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసులను ఏర్పాటు చేశారు.

# ఇంట్లో బంధించి
# బంగారం.. నగదు చోరీ

### బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు



బాధిత మహిళ షర్మిల

శాంతిపురం, జూన్ 6 ప్రభాతవార్త
మండలంలోని కొలమడుగు పంచాయతీ తోపు చేను గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో నిద్రిస్తున్న మహిళను బంధించి బంగారం, నగదు, టువీలర్ చోరీ చేసిన సంఘటన వెలుగుచూసింది. బాధితురాలు షర్మిల పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన యువరాజు జీవనోపాధి నిమిత్తం సింగపూర్ దేశంలో ఉన్నాడు. ఇతని భార్య షర్మిల, పిల్లలు స్వగ్రామంలో ఉంటున్నారు. బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపు తట్టగా షర్మిల కుమారుడు తలుపు తీయగా ఆరుమంది వ్యక్తులు ముసుగులు ధరించి ఉన్నారని వీరిలో ముగ్గురు బయట ఉండగా మరో ముగ్గురు లోపలికి వచ్చి తన కాళ్లు, చేతులు కట్టేసి మెడలో ఉన్న నలభై గ్రాముల బంగారు గొలుసు, బీరువాలోని లక్ష రూపాయల నగదు, పరుపు కింద ఉన్న మరో ముప్పై వేల నగదుతో ఉడాయించారని షర్మిల పేర్కొంది. దొంగలను పట్టుకోబోయిన తన కుమారుడిపై దాడి చేసి టువీలర్‌ను సైతం తీసుకెళ్లారన్నారు. ఇదిగమనించిన తన బావ సుబ్రమణ్యం, అతని కుమారులు వచ్చి తనకు కట్లు విప్పినారన్నారు. విషయాన్ని తన బావ పోలీసులకు సమాచారం అందించారన్నారు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఓటమిపై అంతర్మథనం



కోట, జూన్ 6 ప్రభాతవార్త
రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీస్థాయిలో ఓటమి పాలవడంపై ఆ పార్టీ నాయకులు అంతర్మథనం చెందుతున్నారు. మరీ ఈ స్థాయిలో ఓటమి చవిచూస్తామని ఊహించలేకపోయామని నాయకులు చర్చించుకుంటుండడం గమనార్హం. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అండగా నిలవడం రాజకీయాల్లో కీలక మలుపుగా మారిందని అంటున్నారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను మార్చకపోవడంతో కేసీఆర్ ఓటమి పాలయ్యారని, దీంతో అక్కడి ప్రజలు అధికార పార్టీకి చెప్పిన గుణపాఠాన్ని గుర్తించిన వైఎస్ జగన్ ఏపీ ఎన్నికల్లో తన పార్టీకి చెందిన 102 మంది అభ్యర్థులను మార్చారు. అయితే ఈ నిర్ణయం ఫలితం ఇవ్వలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వాలంటీర్ల వ్యవస్థ ఉన్నా, ప్రజలకు ఉపయోగం జరిగినా దీని వల్ల అధికార యంత్రాంగం నిరాదరణకు గురైంది. ఇది అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో అసంతృప్తిని రాజేసింది. తాము టిడిపి మద్దతుదారులు లేదా సానుభూతిపరులమన్న విషయం బయటకు వస్తే దాడులు చేస్తారనే భయం చాలామందిని వెంటాడింది. వైఎస్ జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలే తప్ప అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి పెట్టలేదన్నది ప్రజల్లోకి బలంగా వెళ్లింది. వృద్ధులకు పెన్షన్ పంపిణీని స్వాగతించినా, యువతకు ఉద్యోగాలు లేకపోవడంతో భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో కూటమి పార్టీల నాయకులు న్యాయం చేస్తారన్న ఉద్దేశంతో టిడిపి, జనసేన, బిజెపికే పట్టంకట్టారు. చంద్రబాబు, లోకేష్ పదేపదే జగన్‌ను సైకోగా అభివర్ణించారు. జగన్ బాబాయ్ వివేకానందరెడ్డి హత్యకు గురై ఐదేళ్లవుతున్నా దోషులు అరెస్టు కాకపోవడంపై ప్రజల మనసులో తీవ్ర అనుమానాలు రేకెత్తించింది. కడప ఎంపీగా పోటీ చేసిన జగన్ సోదరి వైఎస్ షర్మిల తన ఎన్నికల ప్రచారంలో తన అన్న జగన్‌మోహన్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేసింది. వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైఎస్ అవినాష్‌రెడ్డి కుటుంబాన్ని జగన్ వెనకేసుకొస్తున్నారని ప్రచారంలో పదేపదే ప్రస్తావించింది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చుట్టూ సాగిన ప్రచారం వైసీపీని తీవ్రంగా దెబ్బతీసింది. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల భూములు లాక్కుంటారని, ఈ చట్టంవల్ల వారసులకు భూమి బదిలీ చేయడం సాధ్యం కాదని టిడిపి, జనసేన చేసిన ప్రచారం ప్రజల్లో అనుమానాలు రేకెత్తించింది. ఈ ప్రచారాన్ని తిప్పి కొట్టడంలో వైసీపీ విఫలమైంది. గ్రామస్థాయిలో వైసీపీ నాయకులకు పథకాల్లో ఎలాంటి ప్రాధాన్యత లేక పోవడం, అంతా వాలంటీర్లద్వారా జరగడంతో గ్రామస్థాయిలో నేతలు పనిచేయలేదని వాదన వినిపిస్తోంది.

# కలెక్టరేట్ గోడౌన్‌లకు ఈవిఎంలు



చిత్తూరు, జూన్ 6, ప్రభాతవార్త:
సార్వత్రిక ఎన్నికలు 2024 పోలింగ్ పూర్తి కావడంతో ఎన్నికలకు వినియోగించిన ఈవిఎంలు గురువారం తిరిగి కలెక్టర్‌లోని ఈవియంలు గోడౌన్‌లకు చేరాయి. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య గోడౌన్‌లకు వచ్చిన ఈవియంలను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్ష్యంలో ఈవియంల గోడౌన్‌లో భద్రపరచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చిత్తూరు పార్లమెంటు, అసంబ్లీ స్థానాలకు మే13న పోలింగ్, జూన్ 4 లెక్కింపు పూర్తి చేసుకుని ఈవిఎంలు పార్లమెంట్, అసంబ్లీ నియోజకవర్గలకు చెందిన ఈవిఎంలను వేరువేరు గోడౌన్‌లో భద్రపరిచామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పోరేషన్ ఈడి, ఈవియంల నోడల్ అధికారిణి శ్రీదేవి, తెలుగు దేశం పార్టీ నాయకులు సురేంద్ర కుమార్, వైకాపా నాయకులు ఉదయ్, బిఎస్పి నాయకులు ఉదయ్‌కుమార్, డిప్యూటి తహసీల్దార్‌లు సరిత, శోభ, బిందు తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు అందక
# ద్రవిడ తాత్కాలిక ఉద్యోగుల అవస్థలు

### కొత్తప్రభుత్వంపై కోటిఆశలతో ఎదురుచూపు !!



కుప్పం, జూన్ 6 ప్రభాతవార్త
ద్రవిడ భాషలు, సంస్కృతి పరిరక్షణకు స్థాపించిన ద్రవిడ విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగుల ఆకలి కేకలు ఆగడం లేదు. సుమారు పదకొండు నెలలుగా వేతనాలు లేక చిరుద్యోగులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. సుమారు రెండు నెలలుగా వర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఉద్యోగులు నిరసనలు తెలపడం, వర్సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం షరామామూలుగానే మారిపోయింది. ఇచ్చేదే చాలీచాలని జీతం అందులోను పదకొండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఈ చిరుద్యోగులు తమ కుటుంబాలను నెట్టుకురావడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాల్సి న అధికారులు ఒక్కొక్కరే రాజీనామాల పేరిట తప్పుకుంటున్నారని వాపోతున్నారు. రాష్ట్రానికి సిఎం కానున్న చంద్రబాబునాయుడు పాలనలో అయినా తమకు న్యాయం జరుగుతుందని ఉద్యోగులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ద్రవిడ వర్సిటీ అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో పాటు వర్సిటీకి అనుసంధానంగా డిగ్రీ కాలేజ్ ఏర్పాటు తదితర అంశాలను కొత్త ప్రభుత్వం అమలు చేస్తే వర్సిటీ పురోగతి బాట పడుతుంది. అలాగే తమకు అందాల్సి న పదకొండు నెలల వేతనాలు త్వరగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమకు న్యాయం చేస్తారని తాత్కాలిక ఉద్యోగులు ఆశగా ఉన్నారు. ఏదిఏమైనా ద్రవిడ వర్సిటీని సిఎం హోదాలో చంద్రబాబునాయుడు మరలా గాడిన పెడతారని ఆశిద్దాం.

# అమరనాథరెడ్డికి మంత్రివర్గంలో చోటు...!!



పలమనేరు, జూన్ 6, ప్రభాతవార్త:
పలమనేరు ఎమ్మెల్యే మాజీ మంత్రి అమరనాథరెడ్డికి టిడిపి ప్రభుత్వం మంత్రివర్గంలో కీలక శాఖ కట్టబెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఉమ్మడి రాయలసీమ జిల్లాలో టిడిపి బలోపేతానికి కృషి చేసిన అమరనాథరెడ్డికి మంత్రివర్గంలో స్థానం కల్పించే అవకాశం ఉంది. అయితే ఆయన టిడిపి అధికారంలోకి రావడానికి చేసిన కృషికి కీలక శాఖలో మంత్రి అవకాశం లేకపోలేదు. టిడిపిలో సీనియర్ నాయకులు అయిన అమరనాథరెడ్డి 1985 నుండి 1989 వరకు పెద్దపంజాణి మండల టిడిపి యువత అధ్యక్షులుగా రాజకీయ ప్రస్తానం ప్రారంభించారు. అనంతరం 1989 నుండి 1997 వరకు టిడిపి మండల అధ్యక్షులుగా, 2000 నుండి 2005 వరకు రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులుగా, 2004 నుండి 2012 వరకు జిల్లా టిడిపి అధ్యక్షులుగా తెలుగు దేశం పార్టీలో ఆయన సేవలను అందించారు. సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన 1995 నుండి 1996వరకు డిసిసిబి చైర్మన్‌గా పని చేసిన ఆయన అనంతరం 1996లో ఎమ్మెల్యేగా ప్రస్తానం ప్రారంభించిన అమరనాథరెడ్డి టిడిపి ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రిగా ఆయన సేవలు కీలకంగామారాయి. 2019లో టిడిపి ఆధికారం కోల్పోయినప్పటికి టిడిపిలో కీలక వ్యక్తిగా ఉంటు పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఉమ్మడి రాయలసీమ జిల్లాలలో పార్టీలో కీలక పాత్ర పోషించి నాయకులకు, కార్యకర్తలకు ధైర్యంనింపి ప్రజావ్యతిరేఖ విధానాలను ఎత్తిచూపారు. నారా లోకేష్ జిల్లాలో ఎంతో ప్రతిస్థాత్మకంగా చేపట్టిన పాదయాత్రలో అమరనాథరెడ్డి పాత్ర కీలకం. పాదయాత్ర ప్రారంభం నుండి పాదయాత్ర విజయానికి ఆయన కృషి చేశారు. ఆయన కృషిని నారా చంద్రబాబు నాయుడు గుర్తించి గతంలో మంత్రి వర్గంలో అవకాశం ఇస్తామన్నాట్లు సమాచారం. గతంలో పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేసిన 2 సంవత్సరాలలో రాష్ట్రంలో పలు పరిశ్రమల స్థాపనకు కృషి చేశారు. ఆయన కృషితో పలు పరిశ్రమలు రాష్ట్రానికి రావడంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. టిడిపి బలోపేతానికి నేడు అధికారంలోకి రావడానికి కృషి చేసిన అమరనాథరెడ్డికు మంత్రి వర్గంలో కీలక శాఖ అందించే అవకాశం లేకపోలేదు.

## విద్యార్థులకు బహుమతులు ప్రదానం

**కుప్పం, జూన్ 6 ప్రభాతవార్త**



గ్రంథాలయ శాఖ,కుప్పం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా వివిధ పోటల్లో గెలిచిన విద్యార్థులకు గురువారం ఎంఇఒ (2) రాజారాం, లయన్స్‌క్లబ్ జోనల్ అధ్యక్షుడు డా॥ మహేష్, కార్యదర్శి పిజి సెల్వం, హెచ్‌ఎం వెంకటేశ్వర బాబు, రాజలక్ష్మిలు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి సత్యవాణి, స్థానికులు పాల్గొన్నారు.

## కెఇఎస్..లయన్స్‌క్లబ్‌చే చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ

**కుప్పంరూరల్, జూన్ 6 ప్రభాతవార్త**



కుప్పం ఎడ్యుకేషన్ సొసైటీ, లయన్స్‌క్లబ్‌ల అధ్వర్యంలో కుప్పంలోని పలువురు చిరువ్యాపా రులకు గురువారం ఉచితంగా గొడుగులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, లయన్స్‌క్లబ్ జోనల్ అధ్యక్షుడు డా॥ మహేష్‌లు మాట్లాడుతూ చిరు వ్యాపారులకు తమవంతుసాయంగా ఇరవై వేల విలువ చేసే గొడుగులు అందించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు ప్రసాద్, పిజి సెల్వం, సుబ్రమణ్యం, సెంధిల్, చరణ్, లెనిన్, కోఆర్డినేటర్ గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుత్తణి ఆలయంలో దేశం నేతల మొక్కులు చెల్లింపు

**శాంతిపురం, జూన్ 6 ప్రభాతవార్త**



రాష్ట్రంలో తెదేపా అధికారంలో రావడం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కానుండడంతో మండలం లోని రాళ్లబూదుగూరుకు చెందిన తెదేపా నేతలు, కార్యకర్తలు గురువారం తమిళనాడులోని తిరుత్తణి సుబ్రమణ్య స్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నేతలు బసవరాజు, నారాయణ, కేశవరెడ్డి, మురళి, సురేష్, మురళి, రామకృష్ణప్ప, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

## మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడుకు సన్మానం

**శాంతిపురం, జూన్ 6 ప్రభాతవార్త**



మండలంలోని గుండిశెట్టిపల్లి బూత్ పరిధిలో ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావుకు అత్యధిక మెజార్టీ రావడంతో గురువారం మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనా యుడును ఎంఆర్‌పిఎస్ నేత దేవరాజు, జనసేన నేత వేణు, తెదేపా నేతలు ఘనంగా సత్కరించారు. అలాగే ఎం.శాంతంపల్లికి చెందిన దేశం నేతలు విశ్వనాథ నాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్,మణి, నాగరాజు, అనసూయ,గోపాల్, రమేష్, ఆనందనాయుడు, శ్యామల, రూపలను సత్కరించారు.బాబు, నాగరాజు, సరిత, జయారెడ్డి, రామచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

## అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై విచరాణ

**-తెలుగు దేశం నాయకుల డిమాండ్**

**చిత్తూరు,జూన్ 6,ప్రభాతవార్త:**

వివాదాస్పదమైన అధికారులుగా అక్రమాలకు పాల్పడిన వారు,డిప్యూటేషన్‌లపై ఉండి అక్రమాలకు పాల్పడిన అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా తెలుగు దేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్,జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ విలేకరులతో మాట్లాడుతూ...అక్రమాలకు పాల్పడిన అధికారులను నూతన ప్రభుత్వం ఏర్పాటు కాకముందే ఎన్నికల కోడ్ ఉన్న సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రిలీవ్ చేయడం సరికాదని ఆరోపించారు.అక్రమాలకు పాల్పడిన అధికారులు వారు విధులు చేపట్టినప్పటి నుండి ఇప్పటి వరకు ఆర్థిక అవకతవకలపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు.ప్రస్తుతం రిలీవ్ చేపట్టిన అధికారులు,నామినేటెడ్ పదవులలో ఉన్నవారు ప్రభుత్వ సలహాదారులు రాత్రికి రాత్రే దేశం విడిచి పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజాధనం దోచుకున్న వీరిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాపాడడం అన్యాయమన్నారు.టిడిపి ఈఓ ధర్మారెడ్డి,ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి,ఇతర అధికారులు,పదవివిరమణ చేసిన అధికారులు ఉన్నారన్నారు.వీరందరిని రిలీవ్ చేయకుండా నిభందనల మేరకు నూతన ప్రభుత్వ ఏర్పాటు అనంతరం రిలీవ్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధులు సప్తగిరి ప్రసాద్,వెంకటేష్ యాదవ్, పూతలపట్టు నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు ధరణి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డి సోదరుడు మధుమోహన్ రెడ్డి మృతి

**పెద్దపంజాణి జూ॥ 6 ప్రభాతవార్త :**



మాజీ ఎమ్మెల్సీ రెడ్డివారి రెడ్డెప్పరెడ్డి సోదరుడు పుంగనూరు మాజీ సమితి అధ్యక్షుడు రెడ్డివారి ఓబుల్‌రెడ్డి తనయుడు మాజీ ఎంపిపి రెడ్డివారి విజయ్‌భాస్కర్ రెడ్డి సోదరుడు మధుమోహన్ రెడ్డి మృతి చెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందేవారు. అయితే పరిస్థితి విషమించడంతో మధుమోహన్ రెడ్డి బుధవారం మృతిచెం దారు. గురువారం స్వగ్రామమైన చామనేరు పంచాయతీ గోనుమాకులపల్లిలో మధుమోహన్ రెడ్డి అంతక్రియలను నిర్వహించారు.మాజీ మంత్రి పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి సతీమణి రేణుకారెడ్డి, స్థానిక నేతలు మధన్‌మోహన్ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

**పాకాల, జూన్ 6, ప్రభాతవార్త**



పాకాల మండలం నేంద్రగుంట ప్లైవర్ బ్రిడ్జిపై లారీ ఢీకొన్ని ఓ వ్యక్తి మృతిచెందాడు. చిత్తూరు, దొడ్డిపల్లి సాయి వీధికి చెందిన మణి (58) బైక్‌లో బ్రిడ్జిపై వెళ్తూ ఉండగా లారీ ఢీ కొనడంతో కిందపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. 108లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పాకాల ఎస్ఐ మహేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వరసిద్దుని దర్శించుకున్న ఒంగోలు ఎమ్మెల్యే

**కాణిపాకం, జూన్ 6 ప్రభాతవార్త:**



ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ గురువారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నా రు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆలయ ఏఈఓ హరిమాధవరెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## దేశ చరిత్రలోనే రాష్ట్రంలో భారీ మెజారిటీ

**-మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్**

**వి.కోట,జూన్ 6,ప్రభాతవార్త:**



భారత దేశ చరిత్రలోనే రాష్ట్రంలో ఇంత భారీ మెజారిటీ ఇచ్చిన ప్రజలకు పాదాభివందనాలు చేస్తున్నామని వి.కోట టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఏ.ఎం.రంగనాథ్ తెలిపారు.స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మట్లాడుతూ 5 సంవత్సరాలు రాష్ట్రంలో అరాచక పాలన భరించలేక ప్రజలు టిడిపికి ఇంత భారీ మెజారిటీ ఇచ్చిరన్నారు.పార్టీ నాయకులకు,కార్యకర్తలకు, అభిమానులకు ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటామని తెలిపారు.వైకాపా అధికారంలో ఉన్నప్పుడు టిడిపి కార్యకర్తల నుండి టిడిపి అధినేత వరకు అందరిని అనేక హింసలకు గురిచేశారని అయితే వారిలా టిడిపి చేయదని రాజకీయం అంటే కేవలం ప్రజలకు సేవ చేయాడమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చౌడప్ప,రాంబాబు,ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ గౌడ్,మండల యూత్ అధ్యక్షులు ధీరజ్,శబరిష్,నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కుప్పం అభివృద్ధికి చంద్రబాబు, డా॥ కంచర్ల పనిచేస్తారని నమ్ముతున్నాం

**- అభివృద్ధికి సహకరిస్తాం : : ఎమ్మెల్సీ భరత్**

**కుప్పం, జూన్ 6 ప్రభాతవార్త**



కుప్పం అభివృద్ధే ధ్యేయంగా కాబోయే సిఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌లు పనిచేస్తారని తాము మనస్ఫూర్తిగా నమ్ముతున్నట్లు ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పంలో రానున్న ఐదేళ్లలో రెట్టింపు అభివృద్ధి జరుగుతుందని తాము విశ్వసిస్తున్నామని పేర్కొన్నారు. కుప్పం అభివృద్ధికి తాము సహకరిస్తామన్నారు. ఎన్నికల్లో భారీ ఎత్తున విజయం సాధించిన తెదేపా అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, భాజపా నేతలకు, కుప్పం తెదేపా ముఖ్యులకు అభినందనలు తెలిపారు. కుప్పంలో తాము మూడు సార్లు ఓడిపోయామని అయినా తమ పట్ల కార్యకర్తలు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామన్నారు. కుప్పంలోనే ఉంటూ కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజలకు చేతనైనసాయం అందిస్తామన్నారు. ఎన్నికల ఫలితాలు కొంత ఆశ్చర్యం కలిగిస్తున్నాయన్నారు. అయినా ప్రజాతీర్పు శిరసావహిస్తామన్నారు. ఈ ఐదేళ్ల పార్టీ కోసం కష్టపడిన నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు తాను ఏరోజు అన్యాయం చేయలేదని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, మండల కన్వీనర్లు హెచ్ఎం మురుగేష్, బాబురెడ్డి, నేతలు కోదండరెడ్డి,వెంకటేష్, ఈశ్వర్, చెంగప్ప, సిపి మనోహర్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి చీకటిరోజులు పోయాయి

**- కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం**

**కుప్పం, జూన్ 6 ప్రభాతవార్త**



రాష్ట్రానికి చీకటి రోజులు పోయాయని పున్నమిరాత్రులు వచ్చాయని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో కుప్పానికి కొన్ని ప్రాజెక్టులు తీసుకువస్తామన్నారు. తాము ఓట్ల కోసం కాదని కుప్పం ప్రాంత అభివృద్ధి కోసం పనిచేస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కుప్పంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో కుప్పంలో ఆగిపోయిన అభివృద్ధి పనులు పూర్తిచేస్తామన్నారు. హంద్రీ-నీవా కాలువలను పూర్తిచేసి సాగు,తాగునీరు అందించేలా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కుప్పంలో రోడ్డు విస్తరణ పనులు, అసంపూర్తి కమ్యూనిటీ భవనాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామన్నారు. వచ్చే ఐదేళ్లలో కుప్పాన్ని కాబోయే సిఎం చంద్రబాబునాయుడు సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వైకాపా పాలనలో అభివృద్ధి పనులు ముందుకు సాగలేదన్నారు. కుప్పంలో తాము యుద్ధం గెలిచామన్నారు. రాష్ట్రమంతా ఎన్డీయే కూటమి విజయఢంకా మోగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నాడు కష్టాల్లో ఉన్న, నేడు చెడిపోయిన రాష్ట్రాన్ని చంద్రబాబుకు అప్పగించారన్నారు. సమావేశంలో చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేతలు గోపీనాథ్,శాంతారాం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు సత్యేంద్రశేఖర్, ప్రతాప్, నేతలు మణి, సుగుణమ్మ, నబీ, సంతోష్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాక్‌లాగ్ ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానం

**సదుం, జూన్ 6 ప్రభాతవార్త**

జిల్లాలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో భర్తీకాని సీట్ల కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సదుం బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మరియు కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సదుం(బాలురు), పులిచెర్ల(బాలికలు),పెద్ద పంజాణి (బాలికలు), కుప్పం(బాలురు) బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సదుంలో 9000317307, పులిచెర్లలో 7416281148,పెద్ద పంజాణిలో 9515764818,కుప్పంలో 7680985898 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలని చెప్పారు.

## సాయిబాబా ఆలయంలో విశేష పూజలు

**చౌడేపల్లి, జూన్ 6 ప్రభాతవార్త**

స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో పలు కార్యక్రమాలు జరిగాయి. ఉదయాన్నే ప్రధానార్చకుడు పృద్వీనవీన్ ఆధ్వర్యంలో ఉభయదారులచే స్వామివారిని అభిషేకించి, ప్రత్యేకాలంకరణగావించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలనందించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## బయ్యావారికండ్రిగలో తాగునీటి కష్టాలు

**చిట్టమూరు, జూన్ 6 ప్రభాతవార్త**



చిట్టమూరు మండలం బయ్యావారికండ్రిగ గ్రామస్థులు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. గత రెండురోజులుగా గ్రామానికి మంచినీరు అందించే పైపులైన్లు పగిలిపోవడంతో ప్రజలు నీటి కోసం బిందెలు పట్టుకొని పరుగులు తీస్తున్నారు. గున్నాగుంట ఫిల్టర్ పాయింట్ నుంచి పైపులైన్లు ద్వారా బయ్యావారికండ్రిగకు తాగునీటి సరఫరా జరుగుతుంది. తాగునీటి సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుండటంతో గ్రామస్థులు నీటి కోసం పిల్లాపాపలతో బిందెలు పట్టుకొని పొలాల్లో మోటార్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి బయ్యావారికండ్రిగ గ్రామానికి వెళ్లే పైపులైన్ పునరుద్ధరించి తాగునీటి సమస్య పరిష్కరించాల్సి ఉంది.

## కూటమి సునామి పట్ల అరిగెల హర్షం

**చిట్టమూరు, జూన్ 6 ప్రభాతవార్త**



రాష్ట్ర చరిత్రలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి సునామి సృష్టించిందని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు అరిగెల నాగార్జున హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ కూటమి నాయకత్వంపై నమ్మకముంచి కసితో ఓట్లు వేశారని తెలియజేశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజల్లో మార్పువచ్చిందన్నారు. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వం అవలంబించిన విధివిధానాల పట్ల అన్ని వర్గాల వారు అనేక ఇబ్బందులకు గురయ్యారని ఆయన గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో సూళ్లూరుపేట, గూడూరు కూటమి అభ్యర్థులు నెలవల విజయశ్రీ, పాశం సునీల్‌కుమార్‌లకు ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## విజయశ్రీకి మైలారి దంపతుల శుభాకాంక్షలు

**నాయుడుపేట, జూన్ 6 ప్రభాతవార్త**



సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించిన నెలవల విజయశ్రీకి నాయుడుపేట మున్సిపల్ మాజీ ఛైర్మన్ శోభారాణి దంపతులు శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం నెలవల విజయశ్రీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన శోభారాణి, రాజశేఖర్ పుష్పగుచ్ఛం అందజేసి విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గ చరిత్రను తిరగరాసేలా అతి చిన్నవయస్సులోనే విజయశ్రీ సూళ్లూరుపేట తొలి మహిళా ఎమ్మెల్యేగా భారీ మెజార్టీ సాధించడం పట్ల వారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విజయశ్రీ తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం ఆశయాలకు అనుగుణంగా రాజకీయ ప్రవేశం చేసి సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిబాటలో నడపగల శక్తిసామర్థ్యాలు ఆమెకు ఉన్నాయని తెలియజేశారు.

## పౌష్టికాహారం పంపిణీ

**గూడూరు, జూన్ 6, ప్రభాతవార్త**



గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు గురువారం ఆ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు 30 మందికి పౌష్టికాహారాన్ని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా డాక్టర్ సి.ఆర్ రెడ్డి ఆరోగ్య సంజీవని అనే కార్యక్రమం ద్వారా డాక్టర్ జనార్ధన్ రెడ్డి, డాక్టర్ రోహిణి సహకారాలతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, రాము, కుమార్ నాయుడు, మెడనూరు సురేష్ రెడ్డి, నాగరాజు, శ్రీహరి, యశ్వంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి విజయోత్సవ సంబరాలు

**గూడూరు, జూన్ 6, ప్రభాతవార్త**



ఎలక్షన్ ఫలితాలలో అధిక ఓట్లతో గెలుపొందిన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్ధి పాశం సునీల్ కుమార్‌ని గూడూరు పట్టణం అశోక్ నగర్‌లోని వారి స్వగృహంలో నాయకులు , కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, అధికారులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గూడూరు శాసన సభ్యులు సునీల్ కుమార్ మాట్లాడుతూ నన్ను ఇంత ఆదరించి అధిక ఓట్లతో గెలిపించిన నియోజకవర్గ ప్రజానీకానికి ఋణపడి ఉంటానని అన్నారు. మీలో ఒకడిని, మీ కష్టాలు తెలిసిన వాడిగా, లోకల్‌గా నన్ను ఇంత ఆదరించిన మీ అందరి అభిమానానికి కృతజ్ఞతుడుని అని పేర్కొన్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. మీరు చేసిన మేలు మరువలేనిది, అందరం కలిసి పనిచేద్దాం, నియోజకవర్గంను మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

## చరిత్ర తిరగరాసిన టిడిపి

**వాకాడు, జూన్ 6, ప్రభాతవార్త**



దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో చరిత్ర తిరగరాసిన తెలుగుదేశం పార్టీనే అని మండల పార్టీ కన్వీనర్ దువ్వూరు మధుసూధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వాకాడులోని పార్టీ నాయకుడు విజయ్ శేఖర్ రెడ్డి నివాసంలో మండల స్థాయి టిడిపి నాయకులతో తెలుగుదేశం పార్టీ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మదుసూధన్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి ప్రధాతగా, ఒక విజన్‌గా గుర్తించిన ప్రజలు అఖండ మెజారిటీతో గెలుపొందటమే కాకుండా అధికార పార్టీ అయిన వైసిపి ప్రతిపక్షం కూడా రాలేదన్నారు. మండల ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. భారీ కేక్‌ని కట్ చేసి నాయకులందరూ ఒకరికి ఒకరు స్వీట్ తిని సంబరాలు జరుపుకున్నారు. ఈ సమావేశంలో సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, నంద గోపాల్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కృష్ణమూర్తి, జనార్ధన్ రెడ్డి, హరీష్ నాయుడు, ద్వారకనాథ్ రెడ్డి, చరణ్ రెడ్డి, మేరిక కాంచన్, మోహన్ నాయుడు, వేణు నాయుడు, ప్రమీల, చిరంజీవ, నెల్లూరు సుధాకర్ రెడ్డి, అన్నమేటి చంద్రయ్య, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి ...

**నాయుడుపేట టౌన్, జూన్ 6 ప్రభాతవార్త;**

నాయుడుపేట పట్టణంలోని మల్లాం జంక్షన్ వద్ద జాతీయరహదారిపై లారీ ఢీకొని సుమారు(55) సంవత్సరాలు వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. పోలీసుల సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి.లారీ నెల్లూరు నుండి చెన్నైకు వెళుతుండగా మార్గమధ్యలో నాయుడుపేట మల్లాంరోడ్డు జంక్షన్ వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారిని దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని ప్రమాదవశాత్తు లారీ ఢీకొంది. దీంతో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం తెలిపారు. విషయం తెలుసుకొన్న నాయుడుపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించారు. మృతుడు తెలుపుచొక్కా, నల్లపాయింటు ధరించి 5.6అడుగుల పొడవు చామనచాయ రంగు కలిగి ఉన్నాడని తెలిపారు.అనంతరం మృతదేహన్ని పంచనామ నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.లారీ డ్రైవర్‌ను అదుపులోకితీసుకొని కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాయుడుపేట సిఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

## టిడిపి విజయోత్సవ సంబరాల్లో నానాజీ

**చిల్లకూరు, జూన్ 6, ప్రభాతవార్త**

చిల్లకూరు గ్రామంలో మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి ఆధ్వర్యంలో గురువారం చిల్లకూరు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిధిగా ప్రముఖ పారిశ్రామికవేత్త మాజీ పెంచలకోన దేవస్థానం చైర్మన్ తానంకి నానాజీ పాల్గొన్నారు. ముందుగా చిల్లకూరు దర్గాని దర్శించి అక్కడ మత పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం చిల్లకూరులో నాయకులు, కార్యకర్తల నడుమ మంగళవాయిద్యాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలన్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కొనసాగడం మనందరి అదృష్టమన్నారు. గ్రామంలో ర్యాలీగా వెళుతున్నంత సేపు తానంకి నానాజీ, గంగా ప్రసాద్ అభిమానులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వారి వెంట మండల పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రరెడ్డి, నెల్లూరు రామ్మూర్తి బెల్లంకొండ మల్లికార్జున్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓడినా వంకరబుద్ధులు పోని జగన్

**-టిడిపి అధికారప్రతినిధి సుధాకర్‌రెడ్డి**

**తిరుపతి,జూన్ 6ప్రభాతవార్త:**



ప్రజలు ఓటుతో ఛీ కొట్టినా మాజీసిఎం జగన్‌మోహన్‌రెడ్డికి బుద్దిరాలేదని, వంకరబుద్ధులు పోలేదని టిడిపి రాష్ట్ర అధికారప్రతినిధి డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి ఎద్దేవాచేశారు. వైసిపి కార్యకర్తలపై టిడిపి దాడులు చేయిస్తోందనిఆయన తప్పుడు ఆరోపణలు చేయడం ఇందుకు తార్కాణమన్నారు. ఎన్నికల్లోనే ఆయన నాటకాలు ప్రజలు గమనించారని, ఓట్ల లెక్కింపుతో ఘోరంగా ఓడిపోయినా జగన్‌లో పరివర్తన రాలేదని విరుచుకుపడ్డారు. కుక్కతోక వంకరపోదు అనే సామెత జగన్ విషయంలో నిజం అన్నారు. చంద్రబాబు ప్రజాస్వామ్యం, చట్టం, ధర్మానికి విలువ ఇచ్చే వ్యక్తి అని, ఆయనలో క్షమాగుణం ఎక్కువని అన్నారు. టిడిపి నేతలు, కార్యకర్తలు కక్షసాధించాలని అనుకుంటే వైసిపి నేతలు,కార్యకర్తలు వీధుల్లో తిరగలేరని అన్నారు. టిడిపి నేతలు, కార్యకర్తలను వేధించినవారిని చట్టప్రకారంగా చర్యలు తీసుకుంటామని ,ఎవరినీ వదలిపెట్టేదిలేదన్నారు.

## ఎన్వీ ప్రసాద్‌ను కలిసిన ఆర్కాట్ కృష్ణప్రసాద్

**తిరుపతి హెల్త్, జూన్ 6, ప్రభాతవార్త**



తిరుపతి జయశ్యాం థియేటర్ వద్ద కార్యాలయంలో ప్రముఖ నిర్మాత ఎన్వీ ప్రసాద్‌ని రాష్ట్ర బలిజసేన నాయకులు, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికలలో విజయం సాధించినందుకు పరస్పరం కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలలో కూటమి విజయదుంధుభి మోగించిందని ముఖ్యంగా తిరుపతిలో ఆరణి శ్రీనివాసులకి అధిక మెజారిటీ రావడానికి అన్ని వర్గాలు కృషిచేశాయని అందులో ముఖ్యపాత్రను ఎన్వీ ప్రసాద్ పోషించడం ఆనందంగా ఉందని తెలిపారు. అటుపిమ్మట ప్రముఖ నిర్మాత ఎన్వీప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భారీ మెజారిటీ రావడం ఆనందంగా ఉందని, సమాజ సేవకుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ లాంటి వ్యక్తులు పార్టీకి చాలా అవసరమని పేర్కొన్నారు. తరువాత బలిజసేన కార్యవర్గ ఎన్వీ ప్రసాద్‌ను పుష్పగుచ్ఛం అందించి శాలువాతో కప్పి వెంకన్న ప్రతిమను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన, బలిజసేన నాయకులు బెల్లంకొండ సురేష్, చేరుకుల నీలాద్రి, సురేష్, బాసికర్ల రఘు, వినయ్ తదిర సభ్యులు పాల్గొన్నారు.

## 9న సాయంత్రం జీ తెలుగులో

**డ్రామా జూనియర్స్ సీజన్ 7**

**-తెలంగాణామంత్రి సీతక్క ముఖ్యఅతిధి**

**తిరుపతి,జూన్ 6ప్రభాతవార్త:**

తెలుగుప్రేక్షకులకు ఎప్పటికప్పుడు కొత్త షోలతో, రెట్టింపు వినోదాన్ని అందించే జీ తెలుగులో ఈనెల 9వతేదీ ఆదివారం సాయంత్రం డ్రామా జూనియర్స్ సీజన్ 7 ప్రసారమవుతుందని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. విజయవంతంగా 6 సీజన్లు పూర్తిచేసుకున్న జీ తెలుగుడ్రామా జూనియర్స్ అత్యంత ప్రేక్షకాదరణ పొంది డ్రామా జూనియర్స్ సీజన్ 7 ప్రారంభంకానుందన్నారు. 9వతేదీ ఆదివారం సాయంత్రం 6గంటలకు ,ప్రతి ఆదివారం రాత్రి 9గంటలకు భావోద్వేగం నిండిన కథతో ప్రేక్షకుల హృదయాలను తాకనుందన్నారు. సరికొత్త సీరియల్ మేఘసందేశం 10వతేదీ నుండి ప్రారంభమవుతుందన్నారు. సోమవారం నుండి శనివారం వరకు ప్రతిరోజూ రాత్రి 7.30గంటలకు ప్రసారం కానుందన్నారు. డ్రామా జూనియర్స్ 7ను గ్రాండ్‌లాంచ్ ఎపిసోడ్‌లో ప్రారంభించనుందన్నారు

## ఇఓ ధర్మారెడ్డి పాస్‌పోర్టు స్వాధీనం చేసుకోండి

**-సిఐడి పోలీసులకు జనసేన ఫిర్యాదు**

**తిరుపతి,జూన్ 6ప్రభాతవార్త:**



ఐదు సంవత్సరాలులో టిటిడి ఈఓగా ధర్మారెడ్డి తిరుమలలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని జనసేనపార్టీ నేతలు ఆరోపించారు. ధర్మారెడ్డి సెలవుపై వెళ్ళకుండా చూడాలని, ఆయనపై కేసు నమోదు చేసి విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ జనసేనపార్టీ నేతలు కిరణ్‌రాయల్, రాజారెడ్డి, సుభాషిణి, సుమన్‌బాబు, మునస్వామి, కిశోర్ తదితరులు గురువారం తిరుపతిలోని సిఐడి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## అందుబాటులో ఉంటా.. అధైర్యపడొద్దు..!

బాధితులకు మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి పరామర్శ



చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త: వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ అధైర్య పడవద్దనీ అందుబాటులో వుంటామని మాజీ ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. టిడిపి కార్యకర్తల దాడిలో గాయపడిన వైసిపి మండల అధ్యక్షుడు మస్తాన్, వార్డు సభ్యుడు సక్కుర్ వంశీధర్ రెడ్డి, సాధిఖ్‌లను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై తనతో పాటు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మీకు అందుబాటులో వుంటామని అన్నారు. ప్రాణాపాయ పరిస్థితుల జోలికి వెళ్ళవద్దన్నారు. మీపై జరిగే దాడులకు చట్టప్రకారం చర్యలకు పోరాడుదామన్నారు. పార్టీ క్యాడర్‌కు అందుబాటులో వుంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ నగరి చంద్రశేఖర్ రెడ్డి, కోలా అనిల్‌కుమార్, కొత్తపాటి పవన్‌కుమార్ రెడ్డి, తదితరులు వున్నారు.

## నీట్ 2024 ఫలితాలలో సత్తాచాటిన తిరుపతి రామ్ అకాడమి

తిరుపతి విద్య, జూన్ 6, ప్రభాతవార్త



జాతీయ స్థాయి నీట్ 2024 పరీక్షా ఫలితాలలో రామ్ అకాడమి విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారని అకాడమి తిరుపతి బ్రాంచ్ హెడ్ మధుసూధన్ తెలిపారు. 720 మార్కులకు గాను ఎన్ భరత్ తేజ 700, సిహెచ్ మౌనిష 674, యు. ప్రిన్సి 666, మాంగ్ పి 580, భరత్ వంశీ 564, స్నిగ్ధ రెడ్డి 560 మార్కులు సాధించి తమ సత్తా చాటారు. మరి కొందరు విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో పాటు అత్యధిక సీట్లు సాధించగల ర్యాంకులు పొందారు. ఈ సందర్భంగా అకాడెమి చైర్మన్ వైవిఆర్ డైరెక్టర్ పులి మదుసూధన్, నూకల శ్రీ హరి, విద్యార్థులను అభినందించారు. అనంతరం బ్రాంచ్ హెడ్ మధుసూధన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ స్థాయి నీట్ ఫలితాలలో రామ్ అకాడమి విద్యార్థులు ఈ సంవత్సరం 100కు పైగా మెడికల్ సీట్లు సాధించగల ర్యాంకులు పొందారని, భవిష్యత్తులో రామ్ అకాడమి మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించగలదని తెలిపారు.

## వెంకన్నకు టిడిపి నేతల మొక్కులు

తిరుమల,జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:



రాష్ట్రంలో గత ఐదేళ్ళ అరాచకపాలనకు చరమగీతం పాడి ప్రజలు కూటమికి ఓట్లేయ డం, ముఖ్యమంత్రిగా మళ్ళీ చంద్రబాబూ నాయుడు బాధ్యతలు చేపట్టనుండటం సంతోషకరమని టిడిపి నేతలు అన్నారు. చంద్రబాబుకు పాల నసాగించే శక్తిని ప్రసాదించాలని ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని వేడుకుంటూ గురువారం మధ్యాహ్నం తిరుమల ఆలయ అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి నాయకులు రాజుయాదవ్, రాజేంద్రరాజు, కుసుమ తదితరులు మొక్కులు తీర్చుకున్నారు.

## మీ సహకారం ఎన్నటికి మరువలేనిది!

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయానికి మండలంలో మీరు చూపిన చొరవ ఎన్నటికి మరులేనని తెలుగుదేశం పార్టీ తరఫున గెలుపొందిన శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు.శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు గ్రామంలోని తాటిపర్తి ఈశ్వరరెడ్డి, తాటిపర్తి రవీంద్రరెడ్డిల కుటుంబాలను సుధీర్‌రెడ్డి గురువారం కలసినారు. ఎన్నికల్లో శ్రీకాళహస్తి మండలంలో విజయం సాధించటానికి తాటిపర్తి కుటుంబం చొరవ చూపారు.మీ సొంత ఎన్నికల్లా పని చేసి తన విజయానికి కృషి చేశారని, మీకు ధన్యవాదాలని తెలిపారు.

## నాదేండ్లను కలసిన వినూత

శ్రీకాళహస్తి,జూన్ 6 ప్రభాతవార్త



రాష్ట్రంలో జనసేన విజయందుంధుభి మోగించ టంలో కీలకంగా వ్యవహారించిన నాదేండ్ల మనోహర్‌ను శ్రీకాళహస్తి జనసేన పార్టీకి చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కర్త వినూత కోట కలసినారు. రాష్ట్రంలో జనసేన పార్టీ పోటీ చేసిన 21కి 21 స్థానాలు సాధించటంలో నాదేండ్ల మనోహర్ కీలకంగా వ్యవహారించారని వివరించారు. ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాలు గెలిచింది ఒక్క జనసేన మాత్రమే అన్నారు. మనోహర్‌ను తెనాలిలో కలసి అభినందనలు తెలిపారు. ఆమెతో పాటు చంద్రబాబు కోట ఉన్నారు.

## సచివాలయాల కన్వీనర్ మల్లికార్జున్‌గౌడ్ రాజీనామా

శ్రీకాళహస్తి, జూన్ 6 ప్రభాతవార్త



సచివాలయాల కన్వీనర్ ఇన్‌ఛార్జి పదవికి రాజీనామా చేస్తున్నట్లు తిరుకాలమల్లికార్జున్‌గౌడ్ గురువారం తెలిపారు. వైఎస్ఆర్‌సిపి తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్దితో నిజాయితీగా నిర్వహించానని, 2024ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సలహాదారు సజ్జలరామకృష్ణారెడ్డి, జెసిఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ శివశంకర్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డిలు ఆమోదించాల్సిందిగా కోరారు.

## ఇలగనూరు పంచాయతీలో బాధితురాలికి పరామర్శ

తొట్టంబేడు, జూన్ 6 ప్రభాతవార్త



మండలంలోని ఇలగనూరు పంచాయతీకి చెందిన ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న గురవయ్య సతీమణి రమణమ్మ పక్షవాతంతో బాధపడుతూ తిరుపతి సమీపంలోని నారాయణాద్రి ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్ళగా ఆరోగ్యశ్రీ వర్తించలేదని చెప్పడంతో తిరిగి స్వగ్రామంకి చేరుకోవడంతో విషయం తెలుసుకున్న మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు వారి నివాసానికి చేరుకుని బాధితురాలిని పరామర్శించి వారి ఆవేదనను వ్యక్తం చేశారు. రమణమ్మ భర్తకు ఫించను ఆపివేయడం, ఇంటికి తాగునీటి సరఫరాను నిలపివేయడం జరిగిందని వ్యక్తం చేశారు. అనంతరం చరవాణి ద్వారా సచివాలయ సిబ్బందితో గాలిమురళీనాయుడు మాట్లాడి నాలుగు రజక కుటుంబాలకు నీటి సదుపాయం కల్పించాలని, ఆపివేసిన ఫించన్లు మంజూరు చేయాలని వారి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఆర్థికసాయం అందిస్తాని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గౌరీశంకర్, జగదీష్, చంద్ర, కస్తూరయ్యలు పాల్గొన్నారు.

## చంద్రగిరి గెలుపుపై చంద్రబాబు హర్షం

పులివర్తి నానికి అధినేత ఆశీస్సులు



చంద్రగిరి, జూన్ 6 ప్రభాతవార్త: చారిత్రాత్మక చంద్రగిరిలో పాతికేళ్ళ అనంతరం పులివర్తి నాని ఎంఎల్ఏగా అద్భుత విజయం సాధించడం పట్ల టిడిపి అధినేత, కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఎంఎల్ఏగా భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన ఆయన గురువారం తన కుమారుడు పులివర్తి వినీల్‌ను వెంటబెట్టుకుని అధినేతను కలసి ఆశీస్సులు అందుకున్నారు. చంద్రగిరిలో విజయం సాధించడం పట్ల అభినందించిన ఆయన ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమని సూచించారు. అదేవిధంగా హిందూపురం ఎంఎల్ఏ నందమూరి బాలకృష్ణ, కాబోయే సిఎం సతీమణి నారా భువనేశ్వరినీ మర్యాదపూర్వకంగా కలసి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆయనకు అభినందనలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి..!

అంకుర స్వచ్ఛంధ సంస్థ చైర్మన్ జయరామయ్య

రామచంద్రాపురం, జూన్ 6 ప్రభాతవార్త:



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని అంకుర స్వచ్ఛంధ సంస్థ చైర్మన్ జయరామయ్య అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పంబాదూరు వ్యవసాయ క్షేత్రంలో ఆయన మొక్కలు నాటారు. రామచంద్రాపురం ఎస్టీ కాలనీలో జామ, తదితర పండ్ల మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించడానికి మొక్కలు నాటడమే ఏకైకమార్గమన్నారు. ప్రతి ఇంటిలో తప్పకుండా మొక్కలు నాటి సంరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ శాస్త్రవేత్త మహేశ్వరీ, అంకుర స్వచ్ఛంధ సంస్థ ఆర్గనైజర్ నాగరాజు, స్థానికులు లాలెమ్మ, చెంచమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## వాస్తవాలను వక్రీకరించొద్దు : సీఐ

రేణిగుంట, జూన్ 6 ప్రభాతవార్త:



వాస్తవాలను వక్రీకరించవద్దని రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున్ అన్నారు. రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం అత్యవసరంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్తవాలను వక్రీకరించవద్దన్నారు. వక్రీకరించడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందన్నారు. ఏదైనా సంఘటన జరిగినట్టు తెలిస్తే పోలీసులకు తెలియజేసి నిజ నిర్ధారణ చేసుకుని వివరణతో ప్రసార మాధ్యమాల్లో ప్రసారం చేయాలన్నారు. అవాస్తవాల వల్ల ప్రజలు భయాందోళనలకు గురవుతారన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య ఏదైనా గొడవ జరిగినప్పుడు అందుకు కారణాలు తెలుసుకోవాలన్నారు. అలా తెలుసుకోకుండా విభిన్న ప్రచారాలు జరిగినప్పుడు వర్గ పోరుకు ఆస్కారం ఉందన్నారు. అందరూ పోలీసులతో సహకరించాలన్నారు.

## వాటర్ ట్యాంకు మీద పడిన పిడుగు

తప్పిన పెను ప్రమాదం

కేవీబీ పురం, జూన్ 6 ప్రభాతవార్త:

వాటర్ ట్యాంకు మీద పిడుగు పడడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. కేవీబీ పురం మండలం కలత్తూరు గ్రామ నివాసి తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత తిరుపతి జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి ఇంటి మీద ఉన్న వాటర్ ట్యాంకు మీద పిడుగు పడడంతో ట్యాంకు కోసం నిర్మించిన చుట్టూ గోడలు పగిలిపోయాయి. రాత్రి బీభత్సమైన గాలి అతి తీవ్రమైన ఉరుములతో కూడిన వర్షం పడిన నేపథ్యంలో గోపినాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటిలో ఉండిపోయారు. కానీ పిడుగు పడడంతో వారు ఉలిక్కిపడ్డారు. కుటుంబ సభ్యులకు ఏ ప్రమాదం జరగలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఆదిమూలం మంత్రి కావడం ఖాయం

కేవీబీ పురం, జూన్ 6 ప్రభాతవార్త:

ఆదిమూలం మంత్రి కావడం తథ్యమని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వి.థామస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అవినీతికి అరాచకాలు, అక్రమాలు, దుర్మార్గాలు, దోపిడీతో నియోజకవర్గాన్ని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినా జగనాసురుని, పుంగనూరు పుడింగి నుంచి కాపాడుకోవాలన్న ఏకైక లక్ష్యంతో ఈ రాష్ట్రం నియోజకవర్గం సమర్థత, అనుభవం పాలనా దక్షత గల చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాయకత్వంలో కోనేటి ఆదిమూలం సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యేగా పాలనతో సాధ్యమేనని తెలిపారు.

## సుధీర్‌రెడ్డిని కలసిన టీడీపీ నాయకులు

కేవీబీ పురం, జూన్ 6 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించిన బొజ్జల సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబునాయుడు, బాబునాయుడు, శ్రీనివాసులునాయుడు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## నేటి నుంచి అంకమ్మ తిరుణాల ప్రారంభం

పుత్తూరురూరల్, జూన్ 6 ప్రభాతవార్త:

పుత్తూరు మండల పరిధిలోని చిన్నబ్బనాయుడు కండ్రిగ గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ అంకాలపరమేశ్వరి అమ్మవారి తిరుణాల నేటి నుంచి నాలుగు రోజులు పాటు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ శుక్రవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, సాయంత్రం 3 గంటల నుంచి పురవీధుల్లో గెరిగె ఊరేగింపు, రాత్రి అలుగు ఉత్సవం ఉంటుందన్నారు. 8వ తేదీ శనివారం ఆలయ ఆవరణలో పోతురాజు ముగ్గ కార్యక్రమం, 9వ తేదీ ఆదివారం ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టు కార్యక్రమం, రాత్రి 6 గంటలకు భక్తులు పసుపు వస్త్రాలు ధరించి వేపాకు చేత పట్టుకుని అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం, అనంతరం రాత్రి 9 గంటలకు ఊరేగింపు కార్యక్రమం, అలాగే 10వ తేదీ సోమవారం వసంతోత్సవ కార్యక్రమంతో తిరుణాల ముగుస్తుందని గ్రామస్థులు తెలిపారు. ప్రతిరోజు మూడు రోజుల పాటు ఆలయ ఆవరనలో రాత్రి సమయంలో అంకమ్మ కథ కార్యక్రమం కూడా ఉంటుందని తెలిపారు. ప్రతి ఏటా ఆనవాయితీగా తిరుణాళ్ల నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు వివరించారు.

## శ్రీ కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి దేవస్థానం కమిటీ రాజీనామా

పుత్తూరురూరల్, జూన్ 6 ప్రభాతవార్త:

పుత్తూరులోని శ్రీ కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రమేష్‌బాబు గురువారం రాజీనామా లేఖను ఈవోకు పంపారు. ఆయనతో పాటు దేవస్థానం కమిటీ మెంబర్లు బాబు, సుందరం, రమేష్, జయలక్ష్మి, తదితరులు సైతం రాజీనామా లేఖను అందించారు.

## గాలి భానుప్రకాశ్ దంపతులకు ఘన సన్మానం



పుత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ నుంచి నగరి ఎమ్మెల్యే అఖండ మెజార్టీతో గెలిచిన గాలి భానుప్రకాశ్, గాలి శిరీష దంపతులను గురువారం ఉదయం తిరుపతిలోని ఆయన స్వగృహంలో టిడిపి పుత్తూరు పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ఆయన భార్య గాలి లక్ష్మి, ఐటిడిపి రాష్ట్ర సమన్వయకర్త గాలి గోపినాథ్ ఆయన భార్య భాను కలిసి ఘనంగా సత్కరించారు. పూలమాల వేసి, శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. 45,004 ఓట్లతో మెజార్టీతో భానుప్రకాశ్ గెలుపుతో నగరి నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయని, నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

## లక్ష్య సాధన కోసం లక్ష సవాళ్లను ఎదుర్కొన్న లోకేష్

-రాష్ట్ర ఓబిసి ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్

తిరుపతిరూరల్, జూన్ 6 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ లక్ష్య సాధన కోసం లక్ష సవాళ్ళు ఎదుర్కొన్నారని, హాట్‌సీటైన మంగళగిరి నుండి 91వేల అత్యధిక మెజార్టీతో నారా లోకేష్ అనూహ్య విజయం సాధించారని రాష్ట్ర ఓబిసి ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్ తెలిపారు. బడి సుధా యాదవ్ గురువారం మంగళగిరిలో లోకేష్‌ను కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సుధాయాదవ్ మాట్లాడుతూ 2019 ఎన్నికలలో మంగళగిరి నుండి పోటీ చేసిన ఓటమిపాలైన లోకేష్ 2024 ఎన్నికలలో అఖండ విజయం సాధించి, చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ఓటమి పాలైన లోకేష్ అనేకమార్లు వైకాపా నాయకుల నుండి అనేక అవమానాలు ఎదుర్కొన్నారని, యువగళం పాదయాత్రలో అడుగు అడుగున ఆటంకాలు సృష్టించారని గుర్తు చేసారు. ముందున్న లక్ష్య సవాళ్ళు ఎదుర్కొని, సుఫరిపాలన దిశగా ముందుఅడుగు వేయనున్నారని పేర్కొన్నారు.

## పులివర్తి నానికి బిరుదాల శుభాక్షాంక్షలు

తిరుపతిరూరల్, జూన్6 ప్రభాతవార్త:



30సంవత్సరాల తర్వాత చంద్రగిరి కోటపై జెండా ఎగురవేసిన ఘనత పులివర్తి నానికే దక్కుతుందని టిడిపి కార్యనిర్వాహక కార్యధర్శి బిరుదాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలుపొందిన పులివర్తి నానికి బిరుదాల భాస్కర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రాజమండ్రి ఎంపి దగ్గుపాటి పురందరేశ్వరీకి ఘనసన్మానం

బిజెపి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు

చంద్రగిరి, జూన్ 6 ప్రభాతవార్త:



రాజమండ్రి పార్లమెంట్ (ఎంపి) సభ్యురాలుగా ఘన విజయం సాధించిన దగ్గుపాటి పురందరేశ్వరీని బిజెపి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా బిజెపి తరపున ఎంపిగా పోటీ చేసి ఘనవిజయం సాధించడం పట్ల ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువ అలంకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్రంలో సముచిత స్థానం పొందాలనీ, రాష్ట్ర ప్రయోజనాల కొరకు కృషి చేయాలని వారంతా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా బిజెపి ఇన్‌చార్జ్ రెడ్డి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని, ఐరాల మండల అధ్యక్షుడు ఎం.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపిని ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు

చంద్రగిరి, జూన్ 6 ప్రభాతవార్త:



మూడు దశాబ్దాల సుధీర్ఘ విరామం అనంతరం చంద్రగిరిలో టిడిపి,బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి పులివర్తి నాని గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ తొండవాడకు చెందిన టిడిపి నాయకుడు పులికంటి మోహన్ రెడ్డి ఇంటింటికీ వెళ్ళి ప్రతికుటుంబానికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామంలో పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికి, పూలవర్షం కురిపించారు. తొండవాడ, హరిజనవాడ, అరుందతీ వాడ, గోపాలపురంలో ప్రజలతో మమేకమై ప్రతి కుటుంబానికి, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎల్ఏ పులివర్తి నాని సహకారంతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు.

## వైసిపి నాయకులపై దాడి : ముగ్గరికి గాయాలు

పోలీసుల అదుపులో నిందితులు

చంద్రగిరి, జూన్ 6 ప్రభాతవార్త:

వైసిపి మండల అధ్యక్షుడు మస్తాన్, చంద్రగిరి వార్డు సభ్యుడు సక్కుర్ వంశీధర్ రెడ్డి, సాధిఖ్‌లపై బుధవారం రాత్రి టిడిపికి కొందరు యువకులు భౌతిక దాడులకు పాల్పడ్డారు. కొత్తపేటలోని తన ఇంటికి వెళుతున్న మస్తాన్‌ను కొంత మంది యువకులు అటకాయించి దాడికి పాల్పడినట్లు వాపోయారు. మస్తాన్‌పై దాడులను అడ్డుకునేందుకు యత్నించిన సాధిక్ సైతం గాయాలపాలయ్యాడు. అదేవిధంగా ఐతేపల్లి వద్ద గల వంశీ డాబా వద్ద కొంత మంది యువకులు ఘర్షణ పడుతున్నట్లు సమాచారం అందుకున్న వంశీ అక్కడికి వెళ్ళడంతో అతనిపై భౌతికదాడులకు పాల్పడినట్లు వాపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు కొంత మంది నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

## నేడు వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల 63వ వార్షికోత్సవ ఆహ్వానం

తిరుపతి విద్య, జూన్ 6, ప్రభాతవార్త

శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతి 63వ వార్షికోత్సవం ఈ నెల 7వ తేది సాయంత్రం నిర్వహించినట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ పి. సాంబశివ రావు అధ్యక్షతన జరిగే ఈ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి. కరుణాసాగర్, కర్ణాటక రాష్ట్రం తుముకూరు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కెవి అశోక్, వ్యవసాయ వర్సిటీ పాలక మండలి సభ్యులు డాక్టర్ పివి సత్య గోపాల్, హైదరాబాద్ కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ బి. చంద్రశేఖర్, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి. రమణ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి. ప్రభాకర రెడ్డి తెలిపారు.

## ' పింక్ బస్సు సేవలను సద్వినియోగం చేసుకోండి

ఏర్పేడు, జూన్ 6, ప్రభాతవార్త:



స్విమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ పరీక్షలను గ్రామాలలో పర్యటించే పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ వైద్య బృందం సూచించారు. మండలంలోని కోబాక, కొత్తవీరాపురం పంచాయతీలలో గురువారం పింకు బస్సు ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, మరియు అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా స్విమ్స్ క్యాన్సర్ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, రేడియాలజిస్ట్ డాక్టర్ మానస, స్విమ్స్ హాస్పిటల్ సిబ్బంది, ఏర్పేడు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఏ సురేష్ బాబు, కొత్తవీరాపురం హెచ్ డబ్ల్యూసి స్టాఫ్, స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. మహిళల్లో మమోగ్రఫీ, అల్ట్రాసౌండ్,సర్వికల్ పరీక్షలు నిర్వహించారు. అనుమానితులను పింకు బస్సులో గుర్తించారు. ఈకార్యక్రమంలో కోబాక మాజీ సర్పంచి సూర్యనారాయణ, సిహెచ్ఓ కృష్ణవేణి, ఏఎన్ఎం కామాక్షి, ఆశావర్కర్లు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఏర్పేడు మండలంలో వర్షం

ఏర్పేడు, జూన్ 6, ప్రభాతవార్త:

రుతుపవనాల ప్రభావంతో మండలంలో 40పంచాయతీల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. గురువారం మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. ఈవర్షంతో జనజీవనం స్తంభించింది. చిరు జల్లులతో మొదలై భారీ వర్షం కురిసింది. కొన్ని గ్రామాల్లో వరికోత కోస్తున్న రైతులకు ఇబ్బంది కరంగా మారింది.

## నేటి నుంచి ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామివారి ఉత్సవాలు

ఏర్పేడు, జూన్6, ప్రభాతవార్త;

మండలంలోని పాతవీరాపురం గ్రామంలో వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామివారి 50వ వార్షి బ్రహ్మోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదిన ధ్వజారోహణం, 11న శ్రీద్రౌపదీ కళ్యాణం, 14న అర్జునుడు తపస్సు మాను ఎక్కుట, 15న అలుగు నిల్పుట, 16న అగ్నిగుండ ప్రవేశం, 17న వసంతోత్సవం,ధ్వజాలఅవరోహణం వంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు, గ్రాస్థులు పేర్కొన్నారు.

## అభివృద్ధే మా ప్రధాన లక్ష్యం..

తెలుగు యువత వెల్లడి



తిరుపతి హెల్త్, జూన్ 6, ప్రభాతవార్త

రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించి కూటమి ప్రభుత్వం రావడం శుభ సూచికమని బిజెపి, టిడిపి, జనసేనల ఈ ఉమ్మడి పాలన అవినీతి లేని అభివృద్ధి చేసే విధంగా పాలన సాగుతుందని తెలుగు యువత నేత రవి నాయుడు వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా ముందు టిఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులతో కలిసి రవి మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో మొదటి సంతకం డిఎస్సీపై చేస్తారన్నారు. తిరుపతిలో పరిశ్రమలు వస్తాయన్నారు. యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇక వైసిపి గతంలో చేసిన అరాచకాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోయిన వైకాపా ఇక కక్షలు మాని మసలు కోవాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు.

## మూడు పండుగలు ఒకేసారి వచ్చేంత ఆనందం కలిగింది

టిడిపి బీసీ నాయకులు హర్షం

తిరుపతి హెల్త్, జూన్ 6, ప్రభాతవార్త

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలన రావడంతో సంక్రాంతి, ఉగాది, దీపావళి ఈ మూడు పండుగలు ఒకేసారి వచ్చినట్లు సంతోషం కలిగిందని తెలుగుదేశం పార్టీ బీసీ నేతలు జగన్నాథం, సిందుజ, మధుసూధన్ యాదవ్, తులసీదాస్, చేజర్ల మనోహర్ ఆచారి, జ్యోతి, అశోక్, రామారావు, సుబ్బు, రమేష్, రవిలు హర్షం వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం మీడియా ముందు వారు మాట్లాడుతూ కూటమి పాలన రావడానికి చెమటోర్చి కృషి చేసిన బీసీ నేతలకు సముచిత స్థానం ఇస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల ప్రచారం ప్రారంభం నుంచే, తామంతా ఉమ్మడి కూటమి గెలుపు కోసం కృషి చేశామన్నారు. మా కూటమి నేతలు మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కూటమి గెలుపుపై హర్షం

తిరుపతి హెల్త్, జూన్ 6, ప్రభాతవార్త



టిడిపి, బిజెపి, జనసేన కూటమి గెలుపుకు తాము అహర్నిశలు కృషి చేశామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సి సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్ తెలియజేసారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం మీడియా ముందు ఎస్టీసెల్ నాయకులు రెడ్డి నాయక్, రాజారాం, సురేష్, సురేంద్ర, కిషోర్, రమేష్, బాలు తదితరులతో కలిసి మనోహర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కూటమికి చెందిన ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులను గెలిపించే దిశగా పనిచేసి, నాలుగవ సారి సిఎంగా చంద్రబాబును చేయడంలో ప్రధాన పాత్ర పోషించామన్నారు.

# రౌడీయిజానికి చోటు లేదు...గోపాలన్న పాలన కన్నా మిన్నగా ఉంటుంది: సుధీర్‌రెడ్డి




శ్రీకాళహస్తి రూరల్,జూన్ 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం. ఇక్కడకు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు భద్రత కల్పించాలి. వ్యాపారస్తులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవాలి.ఆడబిడ్డలు ప్రశాంతంగా ఉండాలి. అదే లక్ష్యంగా పని చేస్తానని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఊరందూరు గ్రామంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడు తూ శ్రీకాళహస్తి పట్టణంలో 'పీఎంపల్లి' బ్యాచ్ హల్ చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని సమాచారం ఉంది. అలా రౌడీయిజం చేసే వారు పారిపోవాలన్నారు. పద్ధతి మార్చుకోకుంటే జైల్లో ఉంటారు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ప్రజల్ని, ఆడకూతుర్లను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. శ్రీకాళహస్తి ప్రజలు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వారసుడుగా తనకు అవకాశం కల్పించారు. గతంలో ఎవ్వరికి ఇవ్వనంత ప్రాధాన్యత కల్పిస్తూ చరిత్రలో నిలిచిపోయేటట్లు మెజారిటీతో గెలిపించుకున్నారు. ఎన్నో ఆశలు, ఆశయాలు,లక్ష్యాలతో గెలిపించుకున్నారు. మీ ఆశలకు అనుగుణంగా గోపాలన్న పాలన కన్నా మిన్నగా అనిపించుకుంటానని సుధీర్‌రెడ్డి అన్నారు.తన తండ్రి పాలనలో ప్రజలు పోలీసు స్టేషన్లను ఎరుగరని అయితే ఐదేళ్ళ కాలంలో అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కూడా బాధితులు వచ్చినపుడు న్యాయం చేయాలి తప్ప ఇబ్బంది పెట్టరాదన్నారు. పోలీసులు తమ తీరుమార్చుకోవాలన్నారు. లేదంటే ఇబ్బంది పడతారని హెచ్చరించారు.

**శ్రీకాళహస్తి దేవస్థానం నుంచి సంస్కరణలకు శ్రీకారం చుట్టా!**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వ్యవస్థలు అధ్వాన్నంగామారాయి. పరిపాలన కుదేలైంది.వ్యవస్థలను చక్కబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఇది కొంత సమయం పడుతుంది. ఆర్నెల్లలో సరిగ్గా పాలన అందిస్తానని సుధీర్‌రెడ్డి అన్నారు. తనకు శాసన సభ్యుడుగా గెలిపించిన ప్రజలకు 'సుపరిపాలన' అందించుటకు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. అక్కడ అధికారులకు స్పష్టం చేసాను.వచ్చిన భక్తులు ఇబ్బంది పడకూడదు. ఇబ్బంది పెట్టకూడదు.ఎవరైనా కష్ట పెట్టినట్లు తనకు ఫిర్యాదు వస్తే తాను అధికారుల మీద చర్యలు తీసుకుంటానన్నారు.దేవాలయం పవిత్రమైన నిలయం ఇక్కడకు వచ్చిన భక్తులు మరో సారి రావాలనే దిశగా ఉండాలన్నారు.కానీ నేడు ఇక్కడ దళారీ వ్యవస్థ రాజ్యమేలుతుంది.దానిని కూకటి వేళ్ళతో పెకిలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది గుర్తించి అధికారులకు సూచించానన్నారు.

**అధికారులతో సమీక్షలు:**

శ్రీకాళహస్తిలో పరిపాలన గాడిలో పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 13న మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష,14న వ్యవసాయాధికారులతో, 15న ఇరిగేషన్ అధికారులతో సమీక్షలు ఏర్పాటు చేసినట్లు సుధీర్‌రెడ్డి వివరించారు.

## తిరుమల పవిత్రతను కాపాడుతా

**-తిరుమల,తిరుపతి అభివృద్ధిపై అవగాహన -తిరుపతి ఎమ్మెల్యే ఆరణి**



తిరుమల,జూన్ 6(ప్రభాతవార్త)ప్రతినిధి: ప్రపంచవ్యాప్తంగా తిరుమల పుణ్యక్షేత్రం ఎంతో ప్రాశస్త్యం ఉందని, తిరుమల పవిత్రతను కాపాడటానికి తొలిప్రాధాన్యత నిస్తానని తిరుపతి జనసేన పార్టీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఉద్ఘాటించారు. తిరుపతి,తిరుమలను అన్ని విధాలుగా అభివృద్ధిచేయడంలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌కు అవగాహన ఉందన్నారు. వారి సహకారంతో తిరుపతిని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత తొలిసారిగా కుటుంబసభ్యులతో కలిసిఆయన తిరుమలకు వచ్చారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన ఇష్టదైవమ్ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగ నాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుపతి ప్రజలకు మరింత సేవచేయండి

**-ఎమ్మెల్యే ఆరణితో పుష్పావతియాదవ్**



తిరుపతి,జూన్ 6ప్రభాతవార్త: తిరుపతిప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లేసి మీ నాయకత్వాన్ని కోరుకున్నారని, ప్రజలకు అన్ని విధాలా మరింత సేవలందించాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును టిడిపి రాష్ట్రకార్యదర్శి వి.పుష్పావతియాదవ్ అభినందించారు. మీ సారధ్యంలో తిరుమల,తిరుపతి మరింత అభివృద్ధిచెందాలని, స్థానికులకు మీ సేవలు అవసరమని కోరారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత గురువారం మధ్యాహ్నం ఆరణి శ్రీనివాసులును ఆయన ఇంటి వద్ద టిడిపి రాష్ట్రకార్యదర్శి వి.పుష్పావతి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛంతో అభినందించి, దుశ్శాలువతో సత్కరించారు. అందరి సహకారంతో తిరుపతిని అభివృద్ధిచేస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు.

## చంద్రబాబుకు శివయ్య తీర్థప్రసాదాలు



తొట్టంబేడు,జూన్ 6 ప్రభాతవార్త : తొలిసారి శాసనసభ్యుడుగా ఎన్నికైన శ్రీకాళహస్తి నియోజక వర్గ ఎంఎల్‌ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి 43,309 ఓట్ల మెజారిటీతో గెలుపుతో అత్యధిక మెజారిటీ సాధిందిచడంతో గురువారం తెలుగుదేశంపార్టీ జాతీయప్రధాన కార్యాదర్శి, కాబోయే ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలసి కలంకారి కండువాతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందిందించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ దివంగతనేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి చేసిన అభివృద్ధి దిశగా పయనించాలని, నియోజక వర్గంలో ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రజానేతగా పేరుతెచ్చుకోవాలని సుధీర్‌కు సూచించారు.

## వాగవీడు వాలంటీర్‌పై దేశం దౌర్జన్యం!



శ్రీకాళహస్తిరూరల్, జూన్ 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం వాగవీడు గ్రామ వాలంటీర్‌పై తెలుగుదేశం నాయకులు దౌర్జన్యం చేసి భయభ్రాంతుల్ని గురి చేసారు. వివరాలిలా ఉన్నాయి. వాగవీడు గ్రామంలో మహేశ్వరి, పృద్వీలు వాలంటీర్లుగా పని చేస్తున్నారు. ఎన్నికలకు మూడు రోజుల ముందు మహేశ్వరి రాజీనామా చేసి వైకాపాకు మద్దతుగా పని చేసింది. పృద్వీ కూడా వాలంటీర్‌గా పని చేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన దళితవాడకుచెందిన నరేంద్ర అనే యువకుడు రేణిగుంట కార్బన్ కంపెనీలో పనిచేసే వాడు. ఆతన్ని విధుల్లోంచి ఆర్నెల్ల క్రితం తొలగించారు. అయితే అందుకు కారణం వాలంటీర్లు అధికార పార్టీ నాయకుల మాటలు విని తనపై తప్పుడు నివేదికలు ఇచ్చినట్లు ఆరోపణ. తొలగించబడ్డ యువకుడు తెలుగుదేశం మద్దతు దారుడు కావటంతో బుధవారం రాత్రి తన అనుచరులతో వాలంటీర్ల ఇళ్ళ మీదకు వెళ్ళి దౌర్జన్యం చేసినట్లు సమాచారం. ఇంటిలోని సామాన్లను ధ్వంసం చేసారు. ఇరు వర్గాలు రెండు పార్టీలకు చెందిన వారు కాగా బుధవారం రాత్రి గొడవలు జరగటంతో రాజకీయం చోటు చేసుకుంది. గొడవ జరిగిన గ్రామానికి వైకాపా నాయకులు పరుగులు తీసి ఇంత దౌర్జ్యమా అని విమర్శించారు. సమాచారం తెలిసిన వెంటనే రూరల్ పోలీసులు గ్రామానికి వెళ్లి పికెటింగ్ ఏర్పాటు చేసారు.

## జాతీయ ఉపకారవేతనానికి... ఊరందూరు విద్యార్థులు ఎంపిక



శ్రీకాళహస్తి, జూన్ 6 ప్రభాతవార్త: జాతీయ ఉపకారవేతనానికి ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న రుత్విక్, శ్రీకర్, వర్షిత, మరియు నీహారికలు జాతీయ ఉపకార వేతనానికి ఎన్నికయ్యారన్నారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ఒక్కొక్క విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు విద్యార్థులకు ఉపకారవేతనం అందనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులును అభినందించారు. ఉపాధ్యాయులు సురేష్, శాంతి, మల్లికార్జున, మురళీ, శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, హిమబిందు, ఇతర ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పులికాట్ జాలర్ల కుప్పాలలో... అసెంబ్లీ ఎన్నికల ఓట్లు ఇలా

తడ, జూన్ 6 ప్రభాతవార్త: తడ మండలంలో పులికాట్ జాలర్ల కుప్పాల ఓటర్లు ఆయా పార్టీల ఆధిక్యతను బయటపెడతాయి. ఈసారి కూడా ఈ కుప్పాల ఓటర్లు మండలంలో కీలక పాత్ర పోషించారు. కొన్నిచోట్ల వైసీపీకి మరికొన్నిచోట్ల టిడిపికి ఎక్కువ ఓట్లు పడినప్పటికీ ఎక్కువ జాలర్ల కుప్పాలు ఉన్న గ్రామాల్లో టిడిపినే మెజార్టీ కనబరిచింది. మండల పరిధిలోని భీములవారిపాలెం పంచాయతీలో రెండు పోలింగ్ స్టేషన్లకు లెక్కిస్తే 53 ఓట్ల ఆధిక్యత సైకిల్‌కి వచ్చింది. ఇక్కడ అధికార పార్టీ జడ్పిటిసితో పాటు మండల ఉపాధ్యక్షుడు కూడా ఉండటం గమనార్హం. పూడి పంచాయతీ పరిధిలో 103 ఓట్లు టిడిపికి అధికంగా వచ్చాయి. ఇక్కడ తెలుగుదేశం పార్టీలో కె.సెల్వం కీలకపాత్ర పోషించారు. ఇక పెరియవట్టులో వైసీపీకి 23 ఓట్ల ఆధిక్యత వచ్చింది.

**పులికాట్ దీవుల్లో చెరొకటి:**

తడ మండలం పులికాట్ సరస్సు మధ్యలో ఉన్న దీవుల్లో చెరోచోట ఆధిక్యత కనబరిచాయి. ఇరకం పంచాయతీ పరిధిలోని రెండు పోలింగ్ స్టేషన్లలో చెరొక చోట మెజార్టీ ఉన్నప్పటికీ మొత్తంమీద 66 ఓట్లు ఆధికార వైసీపీకి ఎక్కువగా వచ్చాయి. వేనాడు దీవిలోనూ రెండు పోలింగ్‌స్టేషన్లు ఉండగా రెండింటిలో కలిపి 89 ఓట్ల మెజార్టీ తెలుగుదేశం పార్టీకి దక్కింది. ఈ గ్రామంలో వైసీపీ నేత కె.వాసు, టిడిపి సీనియర్ నాయకుడు కె.సుదర్శన్‌రావులు హోరాహోరీ తలపడ్డారు. తడ మండల పరిధిలో చిన్న గ్రామాల్లో ఒకటైన అండగుండల పంచాయతీలో తక్కువ ఓట్లే ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయశ్రీకి 269 ఓట్ల ఆధిక్యం వచ్చింది. మరో చిన్న పంచాయతీ వెండ్లూరుపాడులో టిడిపి 58 ఓట్లు మెజారిటీ సాధించింది. కారిజాత పంచాయతీలో రెండు పోలింగ్ స్టేషన్లు ఉండగా చెరోచోట మెజార్టీ వస్తే మొత్తంమీద టిడిపి అభ్యర్థి 125 ఓట్లు ఎక్కువ సాధించారు.

## నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే అమరనాధరెడ్డి



చిత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త: జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను గురువారం విజయవాడలో పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాధరెడ్డి కలిశారు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించి నారా చంద్ర బాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనుండటంతో పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాధరెడ్డి ఈ సందర్భంగా నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంపీ దగ్గుమళ్ళను అభినందించిన చంద్రబాబు



చిత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అభినందించారు. చిత్తూరు తెలుగుదేశం పార్టీ ఎంపీగా ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన దగ్గుమళ్ళ ప్రసాదరావు గురువారం విజయవాడ ఉండవల్లిలోని నారా చంద్రబాబునాయుడు నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధించి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనుండటంతో పాటు జాతీయ స్థాయిలో సైతం ఎన్డీఏ కూటమికి కీలక మద్దతు ఇవ్వనుండటం, సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్న నారా చంద్రబాబునాయుడును అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడుకు చిత్తూరు నుండి తెలుగుదేశం పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రికార్డు స్థాయిలో 2.25 లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన విషయంను ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు వివరిం చారు. చిత్తూరు పార్లమెంటు స్థానం పరిధిలో ఎంపీ అభ్యర్థికి ఏ నియోజకవర్గంలో ఏ మేరకు మెజార్టీ లభించిందనే విషయంపై పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంపీకి పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు. అలాగే ఎన్డీఏ కూటమి భాగస్వాములైన జనసేన, బిజెపి నాయకులను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్ళాలని ఎంపీ దగ్గుమళ్ళకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చెప్పారు.

## మాజీ సీఎం కిరణ్‌ను కలసిన జనసేన నాయకులు



కాణిపాకం, జూన్ 6 ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌ను జిల్లా జనసేన నాయకులు ఎం.మహేష్ స్వేరో బుధవారం రాత్రి కలికిరిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నిజాం కళాశాల పూర్వ విద్యార్థి అయిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అదే కళాశాలలో చదివిన ఐరాల మండలం తిరువణంపల్లెకు చెందిన మహేష్ స్వేరో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా స్థానిక రాజకీయాలపై ఆయన చర్చించారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర చైర్మన్ పదవికి కుమార్‌రాజా రాజీనామా



బంగారుపాళ్యం, జూన్ 6 ప్రభాతవార్త: రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ పదవికి ఎంబి కుమార్‌రాజా గురువారం రాజీనామా చేశారు. ఈ రాజీనామా పత్రంను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శికి మెయిల్ ద్వారా పంపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎంగా వున్న సమయంలో తనకు ఈ పదవి ఇచ్చారని, వైఎస్ జగన్ ప్రభుత్వం రద్దు కావడంతో తాను తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తనతో పాటు మండలానికి చెందిన రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ కె.అమరనాథ్, రాష్ట్ర కల్లుగీత కార్మిక కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.ఎల్లప్ప, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.మొగిలీశ్వర్లు సైతం రాజీనామాలు చేశారు. కుమార్‌రాజా మాట్లాడుతూ తాము అంతా వైఎస్ జగన్ వెంటే నడుస్తామని తెలిపారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో వుండి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తూ కార్యకర్తల్లో మనోధైర్యంను నింపుతామని పేర్కొన్నారు.

## రాజకీయాల్లో చంద్రబాబునాయుడు ఓ లెజెండ్

**-చంద్రబాబు, లోకేష్‌లను కలిసిన పులివర్తి నాని**



తిరుపతిరూరల్, జూన్ 6 ప్రభాతవార్త: : రాజకీయాల్లో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఓ లెజెండ్ అని, దేశానికి చంద్రబాబు ఆదర్శమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడును గురువారం మంగళగిరిలో పులివర్తి నాని, ఆయన తనయుడు పులివర్తి వినీల్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏ.పి. ఎన్నికలలో సంచలన విజయంతో చరిత్ర సృష్టించారని, చంద్రబాబు విజనరీ నాయకుడని తెలిపారు. రాజకీయాల్లో ప్రత్యర్థులు సైతం గౌరవించి, ప్రసంశించే నాయకుడన్నారు. ఈ-గవర్నెన్స్ పరిచయం చేసారని, డిజిటలైజేషన్‌కు ఆద్యుడని, ఐటి రంగాన్ని విస్తృతంగా చేసిన ఘనత కూడా చంద్రబాబుదే అన్నారు. అంతకమునుపు టిడిపి జాతీయ కార్యధర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి, పుష్పగుచ్ఛం అందజేసారు. చంద్రగిరి నియోజకవర్గంలో 30సంవత్సరాలు తర్వాత రికార్డు స్థాయిలో మెజార్టీ సాధించి, చరిత్ర సృష్టించారని పులివర్తి నానిని లోకేష్ అభినందించారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి, పోరాడి గెలిచారని, చంద్రగిరి అభివృద్ధికి అన్ని విధాల ప్రభుత్వం సహకరిస్తుందని లోకేష్ భరోసా ఇచ్చారని తెలిపారు.

## మహిళావర్సిటీకి ఏపిఎస్సీహెచ్ ఆర్థికసాయం




తిరుపతి విద్య, జూన్ 6 ప్రభాతవార్త :ఎస్పీఎంవీవీ-ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ కొలాబరేషన్స్ (ఐఐసి), క్లస్టర్ యాక్టివిటీలో భాగంగా తిరుపతి క్లస్టర్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి - ఏపీఎస్సీ హెచ్‌ఈ నుంచి రూ. 8,78,000 ఆర్థిక సహాయం లభించింది. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (మహిళా విశ్వవిద్యాలయం), ఐఐటి, ఐఐఎస్‌ఈఆర్ క్యాంపస్‌లు, తిరుపతి, ద్రవిడ విశ్వవిద్యాల యం, కుప్పం జీవవైవిధ్య పరిరక్షణ కోసం క్యాంపస్ బయోడైవర్శిటీ రిజిస్టర్ల సృష్టి అనే పరిశోధనా ప్రాజెక్టు కోసం తిరుపతి క్లస్టర్‌కు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ - ఎపిఎస్‌సి హెచ్‌ఈ నుండి రూ. 8,78,000 ఆర్థిక సహాయం లభించింది. ఈ సందర్భంగా ఎస్‌పిఎంవీవీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి. భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ కొలాబ రేషన్స్ (ఐఐసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ డిఎం మమత, ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ (కోపిఐలు) డాక్టర్ రాబిన్ విజయన్, తిరుపతి ఐఐటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగం డాక్టర్ ప్రసన్న వెంకటేష్ సంపత్, తిరుపతి ఐఐఎస్‌ఈఆర్ బయాలజీ విభాగం డాక్టర్ నందిని రాజమణి, డాక్టర్ రాజా బండి, ద్రవిడ విశ్వవిద్యా లయం విద్యా విభాగం డాక్టర్ వి. మెర్సీ జ్యోతి, ద్రవిడ విశ్వవిద్యాలయం బయో టెక్నాలజీ విభాగం డాక్టర్ రాజేశ్వరరెడ్డి, సద్దాల ఏసీఎస్సీ హెచ్‌ఈ నుంచి నిధులు అందుకున్నారు.

## రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు టిడిపిపై ప్రజలు విశ్వాసం

**-మంచిరోజులు రానున్నాయి -నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్**



తిరుమల,జూన్ 6 ప్రభాతవార్త ప్రతినిధి: గత ఐదేళ్ళ వైసిపి అరాచక పాలన,అవినీతి నుండి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రజలు ఎంతో నమ్మకంతో తెలుగుదేశం పార్టీకి ఓట్లేసి గెలిపించారని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. ముఖ్య మంత్రిగా చంద్రబాబునాయుడు పాలనపై ప్రజలకు విశ్వాసం ఉందని, ఆయన అభివృద్ధినథంలో నడిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నగరి ప్రజలకు తానెప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ఎన్‌డిఎ కూటమిలో టిడిపి భాగస్వామ్యం కావడంతో రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. ప్రజలు తమకు పెద్ద బాధ్యత అప్పగించారని, దాన్ని సక్రమంగా నెరవేర్చి వారికి అందుబాటులో ఉంటానన్నారు. నగరి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత తోలిసారిగా కుటుంబసభ్యులతో కలసి గాలి భానుప్రకాష్ తిరుమలకు వచ్చారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

## నేతలకు వాతలు.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

**- పలు పంచాయతీల్లో టిడిపికి ఆధిక్యత- తడ ఎన్నికల సిత్రాలు ఇవి**



తడ, జూన్ 6 ప్రభాతవార్త : తమిళ ప్రభావం ఎక్కువగా ఉండే తడ మండలంలోని గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కొందరు నేతల పనితీరుకు అద్దంగా నిలిచాయి. నేతలుగా ప్రచారంలో ఉన్న వారి సొంత గ్రామాల్లో అంతంతమాత్రమే ఓట్లు పడ్డాయి. సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో తడ మండలానికి ప్రత్యేకత ఉంది. ఈ మండలంలోని కాదలూరు నివాసి కిలివేటి సంజీవయ్య వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మూడోసారి పోటీచేసి ఓడిపోయారు. మండల పరిధిలోని మరో ప్రధాన గ్రామం చేనిగుంటలో మాజీ ఎంఎల్‌సీ, కూటమిలోని బిజెపి కీలక నేత వాకాటి నారాయణరెడ్డి ఉన్నారు. తడ మండల జాలర్ల నాయకులు, పలు గ్రామాల్లో పదవులు పొందిన నేతలు కూడా ఇక్కడే ఉన్నారు. అయితే ఇవిఎంలు తెరిచిన తర్వాత ఒక్కొక్కరి పనితీరు బయటపడింది. కూటమి గాలిలో ఫ్యాన్ కొట్టుకుపోయినప్పటికీ ఎమ్మెల్యే సొంత మండలంలో 2500కు పైగా ఓట్లు ఆ పార్టీకి తక్కువగా పోలవడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. 1989లో సంజీవయ్య మామ పసల పెంచలయ్యను తడ మండల ఓటర్లే గెలిపించారు. అప్పట్లో ఆయన కేవలం 1600 ఓట్ల తేడాతో విజయం సాధిస్తే ఆ ఓట్లన్నీ తడ మండలానికి కావడం విశేషం. ఈ సారి సొంత మండలంలో ఆధిక్యత వస్తుందని సంజీవయ్య, ఆయన వర్గీయులు భావించారు. అయితే చాపకింద నీరులా అసమ్మతి, బహిరంగంగానే ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలంటూ సమావేశాలు నిర్వహించిన వారిలో తడ మండల అధికార పార్టీ నాయకులు కూడా ఉన్నారు. ఈ కారణం చేత ఎంపీ అభ్యర్థి గురుమూర్తికి పడినన్ని ఓట్లు ఎమ్మెల్యే అభ్యర్థి సంజీవయ్యకు పడలేదు.

**నేతల ఊర్ల తీరిదీ**

ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య స్వగ్రామం కాదలూరులో రెండు పోలింగ్ బూత్‌లు ఉండగా అక్కడ ఆయనకు 327 ఓట్ల ఆధిక్యం లభించింది. ఇక్కడ అనూహ్యంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నెలవల విజయశ్రీకి 694 ఓట్లు పోలవడం ఆశ్చర్యపరిచింది. సొంత గ్రామంలో కనీసం 700 నుంచి వెయ్యి ఓట్ల ఆధిక్యత వస్తుందని భావించిన నేతలు ఈ ఫలితంతో డీలాపడ్డారు. మాజీ ఎంఎల్‌సీ వాకాటి నారాయణరెడ్డి స్వగ్రామం చేనిగుంటలో రెండు పోలింగ్ బూత్‌లు ఉంటే, ఒకచోట ఆధిక్యత తగ్గి మరోచోట కొంచెం పెరగడంతో కేవలం 67 ఓట్ల మెజారిటీ మాత్రమే కూటమి అభ్యర్థి విజయశ్రీకి లభించింది. వాకాటి ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. తడ మండలాధ్యక్షుడు కొళవి రఘు స్వగ్రామం కారూరులో మొత్తం నాలుగు పోలింగ్ బూత్‌లు ఉండగా, ప్రతి బూత్‌లోను అక్కడ అధికార పార్టీకన్నా టిడిపి అభ్యర్థికి మెజార్టీ రావడం మరో విశేషం. ఏకంగా ఆ పంచాయతీ పరిధిలో 450 ఓట్ల మెజారిటీని కోల్పోయారు. ఇదే గ్రామంలో మండల జెసిఎస్ కన్వీనర్ ఆర్ సుందరరెడ్డి కూడా వైసీపీకి నాయకత్వం వహిస్తున్నారు. టిడిపిలో మండల ప్రధాన కార్యదర్శి ఆర్.నీలకంతం ఇక్కడ నాయకత్వం వహించారు. కీలకమైన తడ పంచాయతీ పరిధిలో 4 పోలింగ్ బూత్‌లు ఉండగా, అక్కడ టిడిపికి 193 ఓట్ల మెజార్టీ లభించింది. ఈ పంచాయతీ పరిధిలోనే తడ మండల వైసీపీ అధ్యక్షుడు, జాలర్ల సంఘం నాయకుడు కెళివి ఆర్ముగం ఉన్నారు.

**తడకండ్రిగలో ఒక్క ఓటు తేడా..**

మండల కేంద్రం విభిన్న సామాజికవర్గాల కలయికతో ఏర్పడి ఉన్న తడకండ్రిగ పంచాయతీలో ఐదు పోలింగ్ స్టేషన్లు ఉండగా, అక్కడ 3 వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి. మొత్తం ఈ ఓట్లన్నీ లెక్కిస్తే వైసీపీకి 1579 ఓట్లు, టిడిపికి 1578 ఓట్లు పోలయ్యాయి. అంటే ఒకే ఒక్క ఓటు అధికార పార్టీకి పెరిగింది. ఈ పంచాయతీలో నేతలకు కొదవలేదు. పులికాట్ జాలర్ల కుప్పాలలో మాజీ జడ్పిటిసి బొమ్మన్ శ్రీధర్ స్వగ్రామం వాటంబేడుకుప్పంలో టిడిపికి భారీ ఆధిక్యత వచ్చింది. బొమ్మన్ కుటుంబం ఈ సారి శ్రమించడంతో ఆ పంచాయతీ పరిధిలోని మూడు పోలింగ్ బూత్‌లలో కలిపి ఏకంగా 483 ఓట్ల మెజారిటీ టిడిపికి తెచ్చిపెట్టారు. మండల పరిధిలో మరో నాయకుల ఊరు గ్రద్దగుంట. ఇక్కడ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, అధికార పార్టీలో డిసిఎంఎస్ డైరెక్టర్‌గా ఉన్న గండవరం సురేష్‌రెడ్డిలు ఉన్నారు. అయితే ఈ పంచాయతీ పరిధిలోనే గ్రద్దగుంట, అక్కంపేట పోలింగ్ స్టేషన్‌లో రెండుచోట్లా టిడిపికి ఆధిక్యత వచ్చింది. 272 ఓట్లు సైకిల్‌కి ఎక్కువగా పడటం విశేషం. అయితే ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో మూడు పోలింగ్ స్టేషన్లు ఉన్న కొండూరు పంచాయతీలో తెలుగుదేశం పార్టీ 261 ఓట్లు మెజార్టీ సాధించింది. రాష్ట్ర సరిహద్దుల్లోని రామాపురం పంచాయతీలో తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకుడు టికె శ్రీనివాసన్, ఆయన ప్రత్యర్థి.. మాజీ ఎంపిపి రమేష్ కుటుంబం కలిసి పనిచేయడంతో అక్కడ సైకిల్ జోరు 310 ఓట్ల ఆధిక్యతను తెచ్చింది.